
సాక్షి
వనపర్తి
శనివారం : 2 : డిసెంబర్ : 2023



అవినీతికి అంతమెప్పుడో?
కొందరు ప్రభుత్వ ఉద్యోగులు పెద్దఎత్తున అక్రమ సంపాదనకు పాల్పడుతున్నారు.
వివరాలు 8లో ▸



ఆర్టీసీకి కాసుల వర్షం
మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్‌కు ఈ ఏడాది కాసుల వర్షం కురిసింది.
వివరాలు 10లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 33.8 /21.4
రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మూడంచెల పటిష్ట భద్రత

వనపర్తి: అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా జిల్లాకేంద్రం సమీపంలోని చిట్యాల వ్యవసాయ మార్కెట్ గోదాం వద్ద ఆదివారం భారీ పోలీస్ భద్రత ఏర్పాటు చేయనున్నారు. భవనం చుట్టూ మూడు అంచెల భద్రత విధానం పాటించనున్నారు. ఈవీఎంలు భద్రపర్చిన స్ట్రాంగ్‌రూంల దగ్గర నిఘా అధికంగా ఉంచడంతో పాటు ప్రత్యేక బలగాలు గస్తీ నిర్వహిస్తున్నాయి. ఫలితాల ప్రకటనకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. మొదట బ్యాలెట్ ఓట్లు లెక్కిస్తారు. అనంతరం లెక్కింపు ప్రారంభంకానుంది. మొదటి రౌండ్ ఫలితాలు ఉదయం 10 గంటల వరకు వచ్చే అవకాశం ఉంది.

నేడు ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ టోర్నీ, సెలక్షన్స్

జడ్చర్ల టౌన్: త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి అండర్-17 బాలుర ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక కోసం శనివారం బాదేపల్లి జెడ్పీ హైస్కూల్‌లో శనివారం పోటీలు నిర్వహిస్తున్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే టోర్నీలో కొత్త జిల్లాలైన మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల నుంచి 5 జట్లు హాజరవుతున్నాయి. టోర్నీలో 10 మ్యాచ్‌లు జరగనున్నాయి. మ్యాచ్‌లో ప్రతిభకనబర్చిన క్రీడాకారులను రాష్ట్ర టోర్నీలో పాల్గొనే జట్టుకు ఎంపిక చేయనున్నారు. టోర్నీలో పాల్గొనే మహబూబ్‌నగర్ జిల్లా జట్టు బాదేపల్లి జెడ్పీ హైస్కూల్‌లో శిక్షణ కొనసాగుతుంది.

8 నుంచి రాష్ట్రస్థాయి టోర్నీ..

ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో బాదేపల్లి జెడ్పీ హైస్కూల్‌లో ఈ నెల 8, 9, 10 తేదీల్లో అండర్-17 ఫుట్‌బాల్ టోర్నీ నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు చెప్పారు.

బాదేపల్లి యార్డులో వరికి రికార్డు ధర

ఆర్‌ఎన్‌ఆర్ రకం క్వింటా రూ.3,156



దేవరకద్ర మార్కెట్‌లో వరి ధాన్యం రాశులు

జడ్చర్ల/ దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం ధాన్యానికి రికార్డు స్థాయి ధర దక్కింది. ఆర్‌ఎన్‌ఆర్ రకం ధాన్యానికి క్వింటాల్ గరిష్టంగా రూ.3,096, కనిష్టంగా రూ.1,751 ధరలు లభించాయి. అలాగే శ్రీరామ్ గోల్డ్ ధాన్యానికి రూ.2,996, హంస రకానికి గరిష్టంగా రూ.2,921, కనిష్టంగా రూ.1,656, మొక్కజొన్నకు గరిష్టంగా రూ.2,331, కనిష్టంగా రూ.2191, ఆముదాలకు రూ.5,321, జొన్న క్వింటాల్ రూ.1,912 చొప్పున పలికాయి. కాగా యార్డుకు దాదాపు 15 వేల క్వింటాళ్ల ధాన్యం విక్రయానికి రావడంతో యార్డు ఆవరణ కిక్కిరిసిపోయింది.

లావాదేవీలు ప్రారంభం..

దేవరకద్ర మార్కెట్‌కు రెండు రోజుల సెలవు తర్వాత శుక్రవారం తిరిగి లావాదేవీలు ప్రారంభమయ్యాయి. మార్కెట్‌కు వివిధ గ్రామాల నుంచి దాదాపు 4 వేల బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది. ఆర్‌ఎన్‌ఆర్ రకం ధాన్యం క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,979, కనిష్టంగా రూ.2,462 వచ్చాయి. హంసకు గరిష్టంగా రూ.2 వేలు, కనిష్టంగా రూ.1,874, ఆముదాలకు గరిష్టంగా రూ.5,429 ఒకే ధర వచ్చింది.

వడ్లు క్వింటా రూ.3,231

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం వడ్లు (సోన) క్వింటా గరిష్టంగా రూ.3,231, కనిష్టంగా రూ.1,850 పలికింది. అలాగే, హంస క్వింటాకు రూ.2,850, రూ.1,750 పలకగా, కందులు(ఎర్రవి) క్వింటాకు గరిష్టంగా రూ.11,609, కనిష్టంగా రూ.10,079, కందులు (తెల్లవి) గరిష్టంగా 11,139, కనిష్టంగా రూ.10,109 పలికింది.

మక్తల్‌లో 55 వేల మంది ఓటుకు దూరం

మక్తల్: నియోజకవర్గంలో ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య పెరుగుతున్నా.. పోలింగ్ శాతం మాత్రం ఆశించిన స్థాయిలో నమోదు కావడంలేదు. నియోజకవర్గంలోని పది మండలాల్లో పోలింగ్ స్టేషన్లు 275 నుంచి 284కు పెరిగాయి. ఓటర్ల సంఖ్య కూడా గ్రామీణ ప్రాంతాల్లో పెరిగింది. 2014 ఎన్నికల్లో 2.05 లక్షల ఓటర్లకుగాను 1.41లక్షల మంది తమ ఓటు హక్కు వినియోగించుకోగా.. 63 వేల మంది దూరంగా ఉన్నారు. ఇక 2018లో 2.11 లక్షల ఓటర్లకుగాను 1.63 లక్షల మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 47 వేల మంది ఓటుకు దూరంగా ఉన్నారు. తాజాగా 2023 ఎన్నికల్లో 2.42 లక్షల మంది ఓటర్లకుగాను 1.86 లక్షల మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 77.13 శాతం పోలింగ్ నమోదు కాగా.. 55 వేల మంది ఓటుకు దూరంగా ఉన్నారు.

ఎవరి లెక్కలు వారివే..!

- పోలింగ్ బూత్‌ల వారీగా గణన
- గ్రామాలు, పట్టణాల్లో పోలింగ్ సరళిపై చర్చ
- తామే గెలుస్తామని ఎవరికి వారు ధీమా
- పలు ప్రాంతాల్లో జోరుగా బెట్టింగ్‌లు
- మహబూబ్‌నగర్, వనపర్తి, దేవరకద్ర, జడ్చర్ల, కొడంగల్‌పై పోటాపోటీ
- నారాయణపేట, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్‌పై సైతం..
- రేపు ఓట్ల లెక్కింపు.. అదే రోజు సస్పెన్స్‌కు తెర


సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్:

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి పాలమూరులోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల మధ్య హోరాహోరీగా పోరు కొనసాగగా.. అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది. పోలింగ్ ముగిసిన నేపథ్యంలో అభ్యర్థులు శుక్రవారం ఎవరికి వారు లెక్కల్లో మునిగారు. గ్రామాలు, మండలాలు, పట్టణాల్లో వార్డులు, పోలింగ్ బూత్‌ల వారీగా గణనలో నిమగ్నమయ్యారు. పోలింగ్ ఏజెంట్ల నుంచి పోలైన ఓట్ల జాబితాలను ముందు పెట్టుకుని.. పార్టీ ముఖ్య నేతలతో కలిసి అంచనా వేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ఎన్ని ఓట్లు పోలయ్యాయి.. తమకు ఎన్ని వస్తాయి? ప్రత్యర్థికి పడేటివి ఎన్ని?అని పూర్తిస్థాయిలో జల్లెడ పడుతున్నారు. తగ్గిన, పెరిగిన ఓట్లతో పాటు సైలెంట్ ఓటింగ్ ఎటువైపు మొగ్గు చూపే అకాశముందనే అంశాలపై పూర్తిస్థాయిలో కూపీ లాగుతున్నారు. ప్రాథమిక స్థాయిలో అభ్యర్థులు గెలుపోటములపై ఇప్పటికే ఓ అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. ఏం జరుగుతుందనే ఆందోళన అంతర్లీనంగా ఉన్నప్పటికీ.. ఎవరికి వారు తామే గెల్తున్నామనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం ఎన్నికల అధికారులు ఆదివారం ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టనున్నారు. అదే రోజు ఫలితాలు వెల్లడించనుండగా.. సస్పెన్స్‌కు తెరపడనుంది.

ప్రతి అంశం పరిగణలోకి..

ఈ ఎన్నికల్లో కల్వకుర్తి, మక్తల్, కొల్లాపూర్‌లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్య హోరాహోరీ పోరు కొనసాగినట్లు పోలింగ్ సరళి స్పష్టం చేస్తోంది. మహబూబ్‌నగర్‌లో కారు, హస్తానికి దీటుగా బీజేపీ అగ్రనేతలతో విస్తృత ప్రచారం చేసినా.. పోలింగ్‌కు వచ్చేసరికి బోల్తాపడినట్లు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో ఆ పార్టీ కార్యకర్తలు, అభిమానుల ఓట్లు ఎటువైపు మళ్లాయి? అనేది క్లిష్టంగా మారింది. ఇవి పోనూ మిగిలిన అన్ని నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. ఇలా అభ్యర్థులు ప్రతి అంశాన్ని పరిగణనలోకి తీసుకుని లెక్కలు వేస్తున్నట్లు తెలుస్తోంది.

ఎమ్మెల్యే అభ్యర్థుల సమాలోచనలు



ఎక్కడెక్కడ.. ఎలా అంటే..

గద్వాల: బీఆర్‌ఎస్ అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఉదయం గ్రామాలు, మండలాలు, పట్టణాల వారీగా పోలింగ్ డేటా తీసుకుని తన ఇంట్లో ముఖ్య అనుచరులతో కలిసి చర్చించారు. కాంగ్రెస్ అభ్యర్థి సరిత ఫోన్‌లో ముఖ్యనేతలతో పోలింగ్ సరళిపై మంతనాలు చేశారు. బీజేపీ అభ్యర్థి శివారెడ్డి బలిగెరలో బూత్‌ల వారీగా పోలైన ఓట్ల ఆధారంగా ముఖ్యులతో తమనకు పోలయ్యే ఓట్లపై చర్చించినట్లు తెలిసింది.

అలంపూర్: బీఆర్‌ఎస్ అభ్యర్థి విజయుడు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రాంరెడ్డితో కర్నూలులోని ఆయన నివాసంలో సమావేశమయ్యారు. మండలాల నుంచి వచ్చిన నాయకులతో కలిసి పోలింగ్ సరళిపై లెక్కలు వేసినట్లు సమాచారం. కాంగ్రెస్ అభ్యర్థి సంపత్‌కుమార్ శాంతినగర్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆయా మండలాల నాయకులతో కలిసి చర్చించినట్లు తెలిసింది.

జడ్చర్ల: బీఆర్‌ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి హైదరాబాదులోని తన నివాసంలో ముఖ్య నాయకులతో కలిసి చర్చించారు.

కొల్లాపూర్: బీఆర్‌ఎస్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్ రెడ్డి ఉదయం పలు మండలాల నాయకులతో మాట్లాడి పోలింగ్ వివరాలు తెలుసుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి జూపల్లి కృష్ణారావు కొల్లాపూర్‌లోని తన కార్యాలయంలో పోలింగ్ సరళిపై సమీక్ష చేశారు. బీజేపీ అభ్యర్థి ఎల్లేని సుధాకర్‌రావు తన ముఖ్య అనుచరులతో కలిసి సమీక్షించారు.

మహబూబ్‌నగర్: బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తన నివాసంలో ముఖ్య నేతలతో కలిసి గ్రామాలు, మండలాలు, పట్టణాలు, వార్డులు, బూత్‌ల వారీగా పోలైన ఓట్లపై గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్ తదితర ముఖ్య నేతలతో కలిసి చర్చించారు. కాంగ్రెస్ అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సాయంత్రం తన నివాసంలో పార్టీ ముఖ్యులతో కలిసి పోలింగ్ సరళిపై మంతనాలు చేసినట్లు తెలిసింది.

దేవరకద్ర: బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆల వెంకటేశ్వర్‌రెడ్డి నియోజకవర్గంలోని 8 మండలాలకు చెందిన ముఖ్య నేతలను అన్నాసాగర్‌కు పిలిపించుకుని.. ఎన్నికల సరళి, ఓటింగ్‌పై మంతనాలు చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి జి.మధుసూదన్‌రెడ్డి చిన్నచింతకుంట మండలం దమగ్నపూర్‌లోనే గడిపారు. వివిధ మండలాల నుంచి వచ్చిన కార్యకర్తలతో భేటీ అయి పోలింగ్ సరళిపై చర్చించారు. బీజేపీ అభ్యర్థి కొండా ప్రశాంత్‌రెడ్డి శుక్రవారం దేవరకద్రలోని తన నివాసంలోనే ఉన్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన కార్యకర్తలతో మాట్లాడుతూ కనిపించారు. గెలుపుపై ఆయన వారితో ధీమా వ్యక్తం చేసినట్లు తెలిసింది.

మక్తల్: బీఆర్‌ఎస్ అభ్యర్థి చిట్టెం రామ్మోహన్‌రెడ్డి తన నివాసంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలతో ఓటింగ్ సరళిపై చర్చించారు. కాంగ్రెస్ అభ్యర్థి శ్రీహరి సైతం అంచనాలో నిమగ్నమయ్యారు. బీజేపీ అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి నర్వలో తన నివాసంలో కార్యకర్తలతో భేటీ అయి నియోజకవర్గ ఓటింగ్ సరళిపై ఆరా తీశారు.

బెట్టింగ్‌ల జోరు..



ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాలకు సంబంధించి అభ్యర్థుల గెలుపోటములపై బెట్టింగ్ జోరుగా సాగుతున్నట్లు తెలిసింది. ప్రధానంగా మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న మహబూబ్‌నగర్, వనపర్తి, టీపీసీసీ చీఫ్ రేవంత్ పోటీ చేసిన కొడంగల్‌తో పాటు దేవరకద్ర, జడ్చర, నారాయణపేట, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్‌పై బెట్టింగ్‌లు కాస్తున్నట్లు సమాచారం. హైదరాబాద్, రంగారెడ్డితో తదితర ప్రాంతాలకు చెందిన పందెం రాయుళ్లు రియల్టర్లు, బడా వ్యాపారులతో బెట్టింగ్‌లో పాల్గొంటున్నట్లు వినికిడి. పలు ప్రాంతాల్లోని హోటళ్లు, లాడ్జిలను కేంద్రంగా చేసుకుని భారీ ఎత్తున బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు జిల్లాలో ప్రచారం జరుగుతోంది.

కల్వకుర్తి: బీఆర్‌ఎస్ అభ్యర్థి జైపాల్ యాదవ్, కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి హైదరాబాద్‌లోని వారివారి నివాసం నుంచి ఫోన్లలో తమ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తల వద్ద ఆరా తీశారు. బీజేపీ అభ్యర్థి ఆచారి ఆమనగల్లు పట్టణంలో కార్యకర్తలతో చర్చించారు.

అచ్చంపేట: బీఆర్‌ఎస్ అభ్యర్థి గువ్వల బాలరాజు, కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అచ్చంపేటలో వారివారి ఇళ్లలో నాయకులతో భేటీ అయి గెలుపోటములపై చర్చ చేశారు.

నాగర్‌కర్నూల్: బీఆర్‌ఎస్ అభ్యర్థి మర్రి జనార్దన్‌రెడ్డి తన స్వగ్రామం నేరెళ్లపల్లిలో ఉన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన కార్యకర్తలు, నాయకులతో మాట్లాడి గెలుపుపై భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థి రాజేష్ రెడ్డి తన ఇంట్లో ముఖ్య నాయకులతో కలిసి పోలింగ్ సరళిపై చర్చించారు. విజయం తమదేనని ఆయన ధీమా వ్యక్తం చేసినట్లు సమాచారం.

నారాయణపేట: బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎస్.రాజేందర్‌రెడ్డి నారాయణపేటలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో కలిసి పోలింగ్ సరళిపై చర్చించారు. కాంగ్రెస్ అభ్యర్థి పర్ణికారెడ్డి తన మేనమామ కుంభం శివకుమార్‌రెడ్డి తదితర పార్టీ ముఖ్యులతో కలిసి గెలుపోటములపై అంచనాలు వేశారు.

వనపర్తి : బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి నిరంజన్‌రెడ్డి పెబ్బేరు మండలం శాఖాపూర్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పోలింగ్ సరళిపై చర్చించారు. కాంగ్రెస్ అభ్యర్థి మేఘారెడ్డి మండలాలు తిరుగుతూ ఆయా నాయకులు, కార్యకర్తలతో కలిసి ఓటింగ్ తీరుపై ఆరా తీశారు.

అందరి సహకారంతో సజావుగా పోలింగ్

- 3న లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి
- నారాయణపేట కలెక్టర్ కోయ శ్రీహర్ష

నారాయణపేట: జిల్లాలో అందరి సహకారంతో ఎన్నికలు ప్రశాంతంగా స్వేచ్ఛగా జరిగాయని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ ప్రక్రియ పూర్తయిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కోయ శ్రీహర్ష వెల్లడించారు. గురువారం జరిగిన పోలింగ్ సందర్భంగా నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాల్లో ఉదయం నుంచే ఓటర్లు పెద్ద ఎత్తున బారులు తీరి నిలబడి ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారని తెలిపారు. నారాయణపేట నియోజకవర్గ పరిధిలో 78.36 శాతం, మక్తల్‌లో 77.13 శాతం ఓటు వేయడం జరిగిందన్నారు. 554 పోలింగ్ కేంద్రాల్లో జిల్లా యంత్రాంగం, పోలీసుల సహకారంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగిందన్నారు. యువతకు సంబంధించిన మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. ఇక పోలింగ్ ప్రక్రియను నిరంతరం క్షణక్షణం పర్యవేక్షణ చేసేందుకు కలెక్టరేట్‌లో నియోజకవర్గం వారీగా వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేసి పర్యవేక్షించమన్నారు. ఏ చిన్న లోటు పాట్లు ఉన్న వెంటనే గుర్తించిన అధికారయంత్రాంగం ఎప్పటికప్పుడు సరిచేయడం జరిగిందని పేర్కొన్నారు. మైక్రో అబ్జర్వర్లను నియమించి ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను అందరి సహకారంతో విజయవంతం చే సినందుకుగాను ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నమన్నారు. ఈవీఎంలను గట్టి భద్రత నడుమ గురువారం రాత్రి వరకు దత్త బీఈడీ కళాశాలకు తరలించడం జరిగిందన్నారు. జనరల్ పరిశీలకులు బీపీ చౌహన్ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం స్ట్రాంగ్ రూం సీల్ వేసి మూసి వేశామన్నారు. ఈ నెల 3న ఎన్నికల లెక్కింపు దత్త కాలేజీలో కౌంటింగ్ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సమాచారాన్ని ఇంచార్జీ సీఈఓ అధికారికి పంపినట్లు కలెక్టర్ తెలిపారు. లెక్కింపు కేంద్రంలో మూడంచల భద్రత ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు పర్యవేక్షణలో జరుగుతుందని ఇందుకు గాను భారీ కెట్లు ఇతర ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

ఉచిత గ్రహణమొర్రి స్క్రీనింగ్ క్యాంపు

నారాయణపేట రూరల్: బసవతారకం స్మైల్ ట్రిన్ సెంటర్, ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి, సమగ్రశిక్ష సంయుక్తంగా ఈ నెల 4న ఉచిత గ్రహణ మొర్రి స్క్రీనింగ్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు డీఈఓ ఎండీ అబ్దుల్ ఘని తెలిపారు. డాక్టర్ ముకుందారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా సమీపంలోని భవిత కేంద్రంలో నిర్వహించే శిబిరంలో పెదవి చీలక, అంగిలి చీలకకు సంబంధించిన పరీక్షలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రహణమొర్రి ఆపరేషన్ జరిగిన వారు, భవిష్యత్‌లో అవసరమైన వారు సోమవారం ఉదయం 10 గంటలకు క్యాంపు దగ్గరకు రావాలని కోరారు.

ముగిసిన కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్



ర్యాండమైజేషన్‌ను పరిశీలిస్తున్న సాధారణ ఎన్నికల పరిశీలకుడు సోమేష్ మిశ్రా, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ పవార్

వనపర్తి: అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు విధులు నిర్వర్తించే సిబ్బంది రెండోవిడత ర్యాండమైజేషన్‌ను శుక్రవారం పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి తేజస్ పవార్ వెల్లడించారు. జిల్లాకేంద్రంలోని చిట్యాల శివారు వ్యవసాయ మార్కెట్ యార్డు గోదాంలోని కౌంటింగ్ కేంద్రంలో ఎన్నికల సాధారణ పరిశీలకుడు సోమేష్ మిశ్రాతో కలిసి ర్యాండమైజేషన్ విధానంలో సూపర్‌వైజర్లు, సూక్ష్మ పరిశీలకులను కేటాయించినట్లు తెలిపారు. 14 టేబుల్స్ ఏర్పాటు చేసి లెక్కింపు ప్రక్రియ నిర్వహించనున్నామని.. ఇందుకోసం 20 శాతం అదనపు సిబ్బందితో కలిపి 22 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 25 మంది సహాయకులు, 23 మంది సూక్ష్మ పరిశీలకుల బృందం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలి

- జిల్లా కోర్టు న్యాయమూర్తి వి.రజని



మాట్లాడుతున్న జిల్లా కోర్టు న్యాయమూర్తి వి.రజని

పెబ్బేరు రూరల్: నేటి సమాజంలో చాపకింద నీరులా ఎయిడ్స్ విస్తరిస్తోందని.. కూకటి వేళ్లతో పెకిలించాల్సిన అవసరం అందరిపై ఉందని జిల్లా కోర్టు న్యాయమూర్తి వి.రజని అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం వనపర్తి మండలం చిట్యాల శివారు లారీ ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్‌లో వనపర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మనందరం బాధ్యత గల దేశ పౌరులుగా ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించడం, ముందస్తు జాగ్రతలు పాటించడంతో శాశ్వతంగా నిర్మూలించవచ్చని వివరించారు. అలాగే ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ విభాగం అధికారి బండారి శ్రీనివాస్, న్యాయవాది ఉత్తరయ్య, సఖి కౌన్సిలర్ డేగల కృష్ణయ్య, డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు భీమయ్య, కార్యవర్గసభ్యులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

తగ్గిన పోలింగ్ శాతం

- గత ఎన్నికలతో పోల్చితే సుమారు 4 శాతం తక్కువ ఓటింగ్
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కల్వకుర్తిలో అత్యధికంగా 83.26 శాతం నమోదు
- మహబూబ్‌నగర్‌లో అత్యల్పంగా 70.56 శాతమే..
- గద్వాల, కొడంగల్, నారాయణపేట నియోజకవర్గాల్లో ఓటెత్తిన మహిళలు
- పోలింగ్ శాతంపై పార్టీల అంచనాలు



సాక్షి, నాగర్‌కర్నూల్: అసెంబ్లీ ఎన్నికల పర్వం ముగియగా.. ఆదివారం చేపట్టనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. అయితే గత ఎన్నికల కన్నా ఈసారి తక్కువ శాతం పోలింగ్ నమోదు కావడంతో ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపోటములపై లెక్కలు వేసుకుంటున్నారు. గ్రామాల్లోని పోలింగ్ బూత్‌ల వారీగా ఎవరికి ఎన్ని ఓట్లు పడ్డాయోనన్న దానిపై ఒక అంచనాకు వస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ ఈసారి కనీసం 2 నుంచి 4 శాతం వరకు తక్కువ ఓటింగ్ నమోదైంది. ఎన్నికల్లో ఓటు వేసేందుకు కొంతమంది ఓటర్లు అంతగా ఆసక్తి చూపలేదని తెలుస్తోంది. కాగా.. ఉమ్మడి జిల్లాలోని కల్వకుర్తి నియోజకవర్గంలో అత్యధికంగా 83.26 శాతం ఓటింగ్ నమోదవగా.. ఆ తర్వాత గద్వాలలో 83.12 శాతం నమోదైంది. ఇక అత్యల్పంగా మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో 70.56 శాతం మాత్రమే ఓటింగ్ జరిగింది. గతంలో ఇక్కడ 74.93 శాతం పోలింగ్ నమోదు కాగా.. ఈసారి 4 శాతం మేర పోలింగ్ తగ్గింది.

గద్వాలలో అత్యధికంగా ఓట్లు..

గద్వాల నియోజకవర్గంలో మొత్తం 2,56,605 ఓటర్లు ఉండగా వీరిలో ఉమ్మడి జిల్లాలోనే అత్యధికంగా 2,13,283 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఆ తర్వాత వనపర్తి నియోకవర్గంలో 2.10 లక్షలు, కల్వకుర్తి నియోజకవర్గంలో 2.01 లక్షల ఓట్లు పోలయ్యాయి. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో అత్యల్పంగా 1,78,069 మంది మాత్రమే ఓటేశారు. మహబూబ్‌నగర్ తర్వాత మక్తల్ నియోజకవర్గంలో అత్యల్పంగా 77.13 శాతం మాత్రమే పోలింగ్ అయ్యింది. కల్వకుర్తితోపాటు దేవరకద్ర, గద్వాల, అలంపూర్, కొడంగల్, జడ్చర్ల నియోజకవర్గాల్లో 80 శాతానికి మించి పోలింగ్ నమోదు కాగా.. మిగిలిన చోట్ల ఎక్కడా 80 శాతం దాటలేదు.

నియోజకవర్గాల వారీగా ఓట్ల శాతం వివరాలు

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	పురుషులు	స్త్రీలు	పోలింగ్ శాతం
మహబూబ్‌నగర్	2,52,355	1,78,069	89,384	88,676	70.56
జడ్చర్ల	2,20,244	1,79,652	91,281	88,367	81.63
దేవరకద్ర	2,35,154	1,94,543	98,410	96,133	82.73
వనపర్తి	2,71,151	2,10,739	1,06,606	1,04,132	77.72
నాగర్‌కర్నూల్	2,32,780	1,83,098	93,241	89,556	78.66
అచ్చంపేట	2,42,129	1,93,765	97,866	95,900	80.03
కొల్లాపూర్	2,34,167	1,90,669	98,114	92,553	81.42
కల్వకుర్తి	2,41,762	2,01,285	1,02,739	98,546	83.26
గద్వాల	2,56,605	2,13,283	1,06,262	1,07,012	83.12
అలంపూర్	2,37,938	1,96,307	98,786	97,519	82.50
కొడంగల్	2,36,625	1,93,940	96,403	97,537	81.96
నారాయణపేట	2,31,896	1,81,708	90,593	91,114	78.36
మక్తల్	2,42,254	1,86,860	94,115	92,744	77.13
షాద్‌నగర్	2,36,338	1,94,017	98,577	95,439	82.09

మండలాల వారీగా పోలైన ఓట్లు ఇలా..

మండలం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు
వనపర్తి (పట్టణం, మండలం)	94,478	66,971
పెబ్బేరు	41,510	37,478
గోపాల్‌పేట	31,277	24,842
పెద్దమందడి	31,602	29,339
ఖిల్లాఘనపురం	33,009	29,369
రేవల్లి	17,830	13,609
శ్రీరంగాపురం	16,321	9,131

పురుషుల ఓట్లే అధికం..

ఉమ్మడి జిల్లాలోని చాలా నియోజకవర్గాల్లో మహిళల కంటే పురుష ఓటర్లే ఎక్కువగా తమ ఓటు వినియోగించుకున్నారు. ఉమ్మడి జిల్లాలోని గద్వాల, నారాయణపేట, కొడంగల్ నియోజకవర్గాలు మినహా మిగిలిన అన్నింట్లోనూ పురుషుల ఓటింగ్ శాతం ఎక్కువగా నమోదైంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వనపర్తిలో అత్యధికంగా 2,71,151 మంది ఓటర్లు ఉంటే ఈ ఎన్నికల్లో 2,10,739 మంది ఓటేశారు. అలాగే జడ్చర్ల నియోజకవర్గంలో అత్యల్పంగా మొత్తం 2,20,244 ఓట్లు ఉండగా.. ఎన్నికల్లో 1,79,783 మంది ఓటు వేశారు. ఉమ్మడి జిల్లాలో నియోజకవర్గాల వారీగా తగ్గిన పోలింగ్ శాతం ఎవరికి అనుకూలంగా మారుతుందో.. ఎవరికి చేటు చేస్తుందోనన్నది సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

క్లుప్తంగా

అప్పుల బాధతో వ్యక్తి బలవన్మరణం


గోపాల్(ఫైల్)

ఉండవెల్లి: అప్పుల బాధతో మండల కేంద్రానికి చెందిన వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. శుక్రవారం హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన గోపాల్ (45) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. ఈయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. కాగా ఇంటి నిర్మాణం, ఒకే ఏడాదిలో కుమారుడు, కుమార్తె వివాహం చేశాడు. దీంతో అప్పులు అధికమవడంతో ఆర్థికభారంతో మండల కేంద్రం శివారులోని పంట పొలంలో ఉరేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రాజాపూర్‌లో యువకుడు..


శివ (ఫైల్)

రాజాపూర్: మండల కేంద్రంలో శుక్రవారం ఉరేసుకొని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. మహబూబ్‌నగర్‌లోని రాంనగర్‌కు చెందిన శివ (24) రాజాపూర్‌లో ట్రాక్టర్ మెకానిక్ దుకాణం ఏర్పాటు చేసుకొని తల్లి, చెల్లితో కలిసి ఉంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కుటుంబ పోషణ భారంగా మారడంతో మనోవేదనకు గురై ఇంట్లో ఎవరూలేని సమయంతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అక్క ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

ఆర్థిక ఇబ్బందులతో మరో యువకుడు..

మహమ్మదాబాద్: ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పోషణ భారంగా మారి ఓ యువకుడు నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన గూళ్ల అంజి (28) చెరువుల్లో చేపలు పట్టడానికి కూలీ పనికి వెళ్లేవాడు. తాగుడుకు బానిసై ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పోషణ భారంగా మారి గురువారం సాయంత్రం ఒంటిపై పెట్రోలు పోసుకొని నిప్పంటించుకుని మృతిచెందాడు. అంజికి భార్య మేఘన, రెండేళ్ల కుమార్తె ఉన్నారు.

బస్సు ఢీకొని వ్యక్తి ..


భూత్పూర్: మండలంలోని ఎల్కిచర్ల సమీపం భట్టుపల్లితండా (ఏవీఆర్ కాలనీ) వద్ద శుక్రవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని 35 ఏళ్ల వ్యక్తి మృతిచెందినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. నాగర్‌కర్నూల్ నుంచి భూత్పూర్ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు రహదారి పక్కన నడుచుకుంటూ వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడన్నారు. నల్లటిరంగు టీషర్టు, నల్లటి ప్యాంటు ధరించి ఉన్నాడని.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించి బస్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

ఎడ్లబండిని ఢీకొట్టిన బైక్

- నలుగురికి గాయాలు

పెబ్బేరు రూరల్: ఎడ్లబండిని బైక్ ఢీకొట్టిన ప్రమాదంలో నలుగురికి గాయాలైన ఘటన వనపర్తి జిల్లా శ్రీరంగాపురం సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. శ్రీరంగాపురం గ్రామానికి చెందిన గోవిందమ్మ, బాలీశ్వరమ్మ, బిచ్చన్న వ్యవసాయ పనులు ముగించుకొని ఎడ్లబండిపై ఇంటికి వస్తుండగా, అదే గ్రామానికి చెందిన రమేష్ ద్విచక్ర వాహనంపై వెనుక నుంచి వేగంగా వచ్చి ఎడ్లబండిని ఢీకొట్టాడు. ప్రమాదంలో ఎడ్లబండిపై ఉన్న వారితో పాటు రమేష్‌కు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108లో వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ వెంకటస్వామి తెలిపారు.

అవినీతికి అంతమెప్పుడో?



- ప్రభుత్వ కార్యాలయాల్లో చెయ్యి తడిపితేనే పనులు
- ఈ ఏడాది లంచం తీసుకుంటూ పట్టుబడిన ఏడుగురు ప్రభుత్వ ఉద్యోగులు
- నాగర్‌కర్నూల్‌లో నలుగురు, మహబూబ్‌నగర్‌లో ఇద్దరు, వనపర్తిలో ఒకరు..
- రేపటి నుంచి 9వరకు అవినీతి నిరోధక శాఖ వారోత్సవాలు

మహబూబ్‌నగర్ క్రైం: ప్రభుత్వ ఉద్యోగులకు భారీగా జీతాలు ఇతర అలవెన్సులు వస్తున్నప్పటికీ.. కొందరు అక్రమ సంపాదనకు పాల్పడుతున్నారు. ప్రజలకు చట్ట ప్రకారం చేయాల్సిన పనులకు ధరలు నిర్ణయిస్తున్నారు. ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ఇవ్వకుంటే ముప్పుతిప్పలు పెడుతున్నారు. మూడు చెరువుల నీళ్లు తాగిస్తున్నారు. ప్రజలకు అవసరమైన పనులను చేయకుండా.. లంచం తీసుకుంటూ ఇబ్బందులు పెట్టే అధికారులను పట్టుకునేందుకు ప్రభుత్వం 1988 లో అవినీతి నిరోధక శాఖను ఏర్పాటు చేసింది. ఈ ఏడాది ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఏడుగురు ప్రభుత్వ ఉద్యోగులు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. కేవలం ఏడు కేసులు మాత్రమే నమోదు కావడం చూస్తుంటే.. అసలు ఏసీబీ అధికారులు అవినీతిపరులపై సరైన దృష్టి పెట్టడం లేదా? లేకుంటే మూడో కంటికి తెలియకుండా అవినీతికి పాల్పడుతున్నారా అనే విషయం తెలియాల్సి ఉంది.

ఏడాది	నమోదైన కేసులు
2015	18
2016	7
2017	5
2018	5
2019	11
2020	10
2021	9
2022	6
2023	7

ఈ ఏడాది ఏడు కేసులు నమోదు..

ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది ఏడుగురు ప్రభుత్వ ఉద్యోగులు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. వీరిలో రెవెన్యూ, పోలీస్ శాఖలకు సంబంధించిన ఉద్యోగులు ఉన్నారు. నాగర్‌కర్నూల్‌లో నాలుగు, మహబూబ్‌నగర్‌లో రెండు, వనపర్తి జిల్లాలో ఒక కేసు నమోదు కావడం విశేషం. కోడేరు డిప్యూటీ తహసీల్దార్ పురుషోత్తం, సర్వశిక్ష అభియాన్‌లో పనిచేసే సైట్ ఇంజినీర్ మహేందర్, చారకొండ తహసీల్దార్ నాగమణి, నంచర్ల పంచాయతీ కార్యదర్శి పాండురంగయ్య, ఆత్మకూర్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నర్సింహులు, కల్వకుర్తి ఏఎస్‌ఐ ఆంజనేయులుతో పాటు నవాబ్‌పేట ఎస్‌ఐ పురుషోత్తంపై వచ్చిన ఆరోపణలపై హైదరాబాద్ ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి జైలుకు తరలించారు.

కేసులు ఇలా ఉంటాయి..

- ప్రభుత్వ ఉద్యోగులు చట్టం ప్రకారం చేయాల్సిన పనుల విషయంలో లంచం అడగడం, తీసుకోవడం నేరం. లంచం తీసుకున్నట్లు తేలితే సెక్షన్-7 ప్రకారం కేసు నమోదు చేస్తారు.
- ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉంటే సెక్షన్-13 (1) (సి) ప్రకారం చర్యలు తీసుకుంటారు.
- విధి నిర్వహణలో అవకతవకలకు పాల్పడినా, నిర్లక్ష్యంగా వ్యవహరించినా, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసినా సెక్షన్-13 (1), (ఎ నుంచి డీ) వరకు అవినీతి నిరోధక చట్టం 1988 ప్రకారం కేసులు పెడతారు.
- అక్రమ ఆస్తి కూడబెట్టడంలో సహకరించిన బంధువులు, స్నేహితుల మీద ఐపీసీ 109 సెక్షన్ ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

లంచం అడిగితే ఫిర్యాదు చేయండి..

ప్రభుత్వ ఉద్యోగులు ఉచితంగా పనులు చేయాలి. ఎవరైనా లంచం అడిగితే నేరుగా డయల్ 1064ను సంప్రదించి ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయాలి. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సిటిజన్ ఛార్ట్ ఏర్పాటుతో పాటు ఏ అధికారి ఏ విధులు నిర్వహిస్తున్నారనే దానిపై బోర్డు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

– శ్రీకృష్ణగౌడ్, డీఎస్పీ, ఏసీబీ

నేరం రుజువైతే ఉద్యోగం పోయినట్లే..

లంచం తీసుకుంటూ దొరికిన ఉద్యోగులను ఏసీబీ అధికారులు 24 గంటల్లో కోర్టులో హాజరు పరుస్తారు. చాలా వరకు బెయిల్ దొరకదు. కోర్టు రిమాండ్‌కు తరలిస్తుంది. కోర్టులో నేరం రుజువు అయితే ఆరేళ్ల వరకు జైలుశిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంటుంది. అవినీతి అధికారుల ఆస్తులను కోర్టు స్వాధీనం చేసుకుంటుంది. వారిని ఉద్యోగం నుంచి ప్రభుత్వం సస్పెండ్ చేస్తోంది. పెండింగ్ విచారణ పేరుతో ఉద్యోగంలోకి తీసుకున్నా.. కేసు పూర్తయే వరకు ఇబ్బందులు తప్పవు. పదోన్నతులు, ఇంక్రిమెంట్లు ఇతర సౌకర్యాలను కోల్పోతారు. మానసిక వేదనకు గురికావాల్సి వస్తోంది. సమాజంలో పలు అవమానాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. చివరికి కోర్టులో నేరం రుజువైతే జైలుశిక్షతో పాటు ఉద్యోగం నుంచి పూర్తిగా తొలగిస్తారు.

స్వరం.. చంద్రశేఖరుడి వరం


మహబూబ్‌నగర్‌లో గాన కచేరీ చేస్తున్న గద్వాల చంద్రశేఖరరావు

- తిరుమలలో 151 సార్లు గానకచేరి చేసిన గద్వాల చంద్రశేఖరరావు
- ఏడుకొండలు మురిసేలా గాత్రం..
- కన్నడ దాసర పదగలతో పలకరింపు

'ఆయన ఓ సామాన్య కుటుంబానికి చెందిన వ్యక్తి. బాల్యం నుంచి సంగీతంపై మక్కువ పెంచుకొని చేసిన కఠోర సాధనే ఆయనను ప్రముఖ సంగీత విద్వాంసుల సరసన చేర్చింది. ప్రస్తుతం 65 ఏళ్ల వయస్సులోనూ నిత్య విద్యార్థిగా సాధన చేస్తున్నారు.. ఆయనే ప్రముఖ సంగీత విద్వాంసుడు గద్వాల చంద్రశేఖరరావు. ఇప్పటి వరకు వెయ్యి ఇళ్లలో 'అన్నమయ్య సంకీర్తనలు మీ ముంగిట' పేరిట ఓ కార్యక్రమం పూర్తిచేశారు.'

స్టేషన్ మహబూబ్‌నగర్: గద్వాల చంద్రశేఖరరావు 1958, జూన్ 3న గద్వాలలో జన్మించారు. సంగీత విద్వాంసురాలైన తల్లి ఇందిరమ్మ నుంచి అన్నమయ్య సంకీర్తనల ఆలాపనలో తర్ఫీదు పొందారు. టీటీడీ ఆస్థాన గాయకుడు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్, బి.రఘునాథ్, నాగేశ్వరనాయుడుల స్ఫూర్తితో సంగీతంలో మెళకువలు నేర్చుకున్నారు. బీఏ, బీఈడీ రెగ్యులర్ కోర్సుతో పాటు 1983లో కర్ణాటక శాస్త్రీయ గాత్ర సంగీతంలో హైదరాబాద్‌లో డిప్లొమా పూర్తి చేశారు.

తిరుమలలో సంగీత కచేరి..

1996లో ప్రారంభించిన అన్నమాచార్య సంకీర్తనల ఆలాపన యజ్ఞం 27 ఏళ్లుగా కొనసాగిస్తున్నారు గద్వాల చంద్రశేఖరరావు. తిరుమలలో జరిగే శ్రీవారు, పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు, సహస్ర దీపాలంకరణ, నాదనీరాజనం తదితర విశేష కార్యక్రమాల్లో అన్నమయ్య సంకీర్తనలు, కన్నడభాషలోని దాస సాహిత్య సంకీర్తలు ఆలపించి అందరి మన్ననలు పొందుతున్నారు. తిరుమల తిరుపతిలో ఇప్పటి వరకు 151 సార్లు అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు. జిల్లాకేంద్రంలో అన్నమయ్య సంగీతవాణి లలిత విద్యాలయాన్ని స్థాపించి చిన్నారులు, యువతకు సంగీతంలో శిక్షణ ఇస్తున్నారు.

ఇంటింట దాసర పదగలు..

టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి ఆనందతీర్థాచార్యుల స్ఫూర్తితో కన్నడభాషలో 'ఇంటింట దాసర పదగలు' అనే భక్తి సంగీత విభావరిని నిరంతరం నిర్వహిస్తున్నారు. 2013 నుంచి ప్రతి ఏకాదశి రోజున ఆసక్తి ఉన్న వారి ఇళ్లలో ఏడు సంకీర్తనలు, 108 సార్లు సహస్ర నామాలు ఆలపిస్తున్నారు. 2011లో మహబూబ్‌నగర్ పిల్లలమర్రి రోడ్డులో ఉన్న ఏకాంబరేశ్వర ఆలయంలో ఏకధాటిగా 8 గంటల పాటు 108 సంకీర్తనలు ఆలపించి సంగీత అభిమానుల ప్రశంసలు పొందారు. పట్టణ బ్రాహ్మణ యువజన సేవాసమితి ఆధ్వర్యంలో స్థానిక నగరేశ్వర స్వామి ఆలయంలో సప్తరాగాల సంకీర్తన, 108 మంది మహిళలకు ఏడు సంకీర్తనలపై శిక్షణనిచ్చి వారితో ఏడు ఆలయాల్లో పాడించారు. ముగింపుగా 2013, డిసెంబర్ 15న అన్నమయ్య జన్మస్థలమైన తాళ్లపాకలో ఆలపించారు. 2019 నుంచి జిల్లాకేంద్రంలో శ్రీ వనమాలి పాదపద కవితా సంకీర్తన సప్తాహ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారు.

దేవుడిచ్చిన అదృష్టం..



తిరుమలలో గాన కచేరి చేయడం దేవుడిచ్చిన అదృష్టంగా భావిస్తున్నా. ఇటీవలే అమెరికాకు వెళ్లి 12 ఆలయాల్లో అన్నమయ్య సంకీర్తనలు ఆలపించా. మహబూబ్‌నగర్‌లోని అంధుల, దివ్యాంగుల పాఠశాల, అనాథ శరణాలయాల్లో నిస్వార్థంగా అన్నమయ్య సంకీర్తనలపై చిన్నారులకు శిక్షణ ఇస్తున్నా. 'ప్రతి గుడిలో అన్నమయ్య వెన్నెల పాటల పంట' అనే కార్యక్రమంతో ఆలయాల్లో విద్యార్థులతో సంకీర్తన సేవలు నిర్వహిస్తున్నా.

– గద్వాల చంద్రశేఖరరావు, ప్రముఖ విద్వాంసులు

జ్ఞానసరస్వతి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో కార్తీక శుక్రవారాన్ని పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు సరస్వతిదేవికి అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లా నలుమూలల నుంచి భక్తులు ఉదయాన్నే బీచుపల్లికి చేరుకొని చదువులతల్లి సరస్వతీదేవిని దర్శించుకొన్నారు. అదేవిధంగా ఎర్రవల్లి చౌరస్తాలోని శివాంజనేయ స్వామి ఆలయంలో కుంకుమార్చన పూజలు వైభవంగా నిర్వహించారు. మహిళలు కార్తీక దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు.


కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

చెరువులోకి దూసుకెళ్లిన వాహనం



నాగర్‌కర్నూల్ క్రైం: కేసరి సముద్రం చెరువులోని క్రూజర్ వాహనం దూసుకెళ్లిన ఘటన శుక్రవారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం మున్సిపాలిటీ పరిధిలోని ఎండబెట్ల గ్రామానికి చెందిన మధు క్రూజర్ వాహనంలో జిల్లా కేంద్రానికి వస్తుండగా కేసరి సముద్రం వద్దకు రాగానే ప్రమాదవశాత్తు చెరువులోని దూసుకెళ్లింది. అప్రమత్తమైన డ్రైవర్ మధు వెంటనే చెరువులో నుంచి ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకుని ప్రాణాలు రక్షించుకున్నాడు.

41,631 మంది ఓటుకు దూరం



అలంపూర్: అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరుగుతూ వస్తోంది. ప్రతి సారి ఓటర్లు పెరుగుతున్నారు. అందుకు అనువుగా పోలింగ్ శాతం పెరుగుతోంది. పోలింగ్ శాతాన్ని పెంచడానికి ఎన్నికల సంఘం జోరు ప్రచారాలతో ఓటర్లలలో అవగాహన కల్పిస్తోంది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఓటరు చైతన్యంతో ముందుకు వస్తున్నారు. కానీ పోలింగ్ మాత్రం వంద శాతానికి దూరంగా ఉంటుంది. దీంతో గెలుపోటములపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. 2009 సార్వత్రిక ఎన్నికల 1,88,678 మంది ఓటర్లు ఉండగా 1,29282 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో 2,10,047 మంది ఓటర్లు ఉండగా 1,58,069 మంది ఓటు హక్కు వినియోగించకోవడం జరిగింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 2,17,157 మంది ఓటర్లు ఉండగా 1,79,683 మంది, 2023 ఎన్నికల్లో 2,37,938 మంది ఓటర్లు ఉండగా 1,96,307 మంది తమ ఓటు హక్కును వి నియోగించుకున్నారు. ఇదిలాఉండగా, 2009లో 59,396 మంది ఓటర్లు పోలింగ్‌కు దూరంగా ఉన్నారు. అలాగే, 2014లో 51,978 మంది, 2018లో 37,474 మంది, 2023 ఎన్నికల్లో 41,631 మంది ఓటర్లు పోలింగ్‌కు దూరంగా ఉన్నారు. ప్రతి సారి జరిగే ఎన్నికల్లో దాదాపు 15 నుంచి 20 శాతం మంది ఓటర్లు పోలింగ్‌కు దూరంగా ఉంటున్నారు. ఎన్నికల సంఘం ప్రచారం మరింత విస్తృత పర్చాల్సిన అవసరం ఉంది.

గ్రామీణులు పోటెత్తారు

- చాలా గ్రామాల్లో 90శాతం ఓటింగ్ నమోదు
- పోలింగ్‌పై పట్టణ ఓటర్ల అనాసక్తి
- కొడంగల్‌లో 82 శాతం, అత్యల్పంగా దౌల్తాబాద్‌లో 77 శాతం

కోస్గి: కొడంగల్ నియోజకవర్గంలో మొత్తం 81.98 శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. నియోజకవర్గంలోని ఐదు ఉమ్మడి మండలాల పరిధిలో ఏర్పాటు చేసిన 275 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొడంగల్, కోస్గి, మద్దూర్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాలకు చెందిన 1,93,940 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 96,403 మంది పురుష ఓటర్లు, 97,537 మంది మహిళ ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గ కేంద్రమైన కొడంగల్‌లో అత్యధికంగా 82 శాతం ఓటింగ్ నమోదు కాగా అత్యల్పంగా దౌల్తాబాద్ మండలంలో 77 శాతం ఓటింగ్ నమోదైంది. ఇదే క్రమంలో కోస్గి మండలంలో 81.49 శాతం, మద్దూర్ మండలంలో 81.68 ఓటింగ్ నమోదైంది.

గ్రామీణ ప్రాంతాల్లో రికార్డు స్థాయి ఓటింగ్..

నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన 275 పోలింగ్ కేంద్రాల్ని పరిశీలిస్తే గ్రామీణ ప్రాంతాల్లోని కేంద్రాల్లో ఓటర్లు రికార్డు స్థాయిలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. కోస్గి మండలంలోని 9 పోలింగ్ కేంద్రాల్లో 90 శాతానికి పైగా ఓటింగ్ నమోదుకాగా అదే స్థాయిలో మిగిలిన నాలుగు మండలాల్లో సైతం సగానికి పైగా కేంద్రాల్లో 90 శాతం ఓటింగ్ నమోదైంది. మొత్తం 275 పోలింగ్ కేంద్రాల వారిగా పరిశీలిస్తే కోస్గి మండలంలో కొత్తపల్లి గ్రామంలో అత్యధికంగా 95 శాతం ఓటింగ్ నమోదైంది. మండలాల వారీగా పరిశీలిస్తే.. కోస్గి మండలంలో 81.49 శాతం, మద్దూర్‌లో 81.68 శాతం, దౌల్తాబాద్‌లో 77 శాతం, కొడంగల్‌లో 82 శాతం ఓటింగ్ నమోదైంది.

పట్టణ ప్రజల్లో చైతన్యం కరువు

అధికార యంత్రాంగం ఓటు హక్కును వినియోగించుకోవాలని విస్తృతంగా ప్రచారం చేసినప్పటికి గ్రామీణ ప్రాంతాల్లో వచ్చిన చైతన్యం పట్టణ ప్రాంతాల్లో కనబడకపోవడంతో ప్రధాన పట్టణాలన్నింటిలో ఓటింగ్ తక్కువగా నమోదైంది. ఓటింగ్ సరళిని పరిశీలిస్తే పట్టణ ఓటర్లు ఓటింగ్‌పై పెద్దగా ఆసక్తి చూపలేకపోయారు. నియోజకవర్గంలో కొడంగల్, కోస్గి, మద్దూర్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండల కేంద్రాలు అత్యల్ప ఓటింగ్ శాతం నమోదైన కేంద్రాలుగా ఉండటమే ఇందుకు నిదర్శనం. ఉదాహరణగా కోస్గి మున్సిపాలిటీని పరిశీలిస్తే కోస్గి పట్టణంలో మొత్తం 13454 మంది ఓటర్లు ఉండగా వీరిలో 8430 మంది ఓటర్లు అంటే కేవలం 62 శాతం ఓటర్లు మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. కొడంగల్‌లో ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపులో కీలకంగా ఉండే కోస్గి మండలంలో ఈ సారి 81.49 శాతం ఓటింగ్ నమోదు కావడంతో ఇరు పార్టీల నేతలు, కార్యకర్తలతోపాటు 3వ తేదిన వెలువడే ఫలితాల కోసం నియోజకవర్గ ప్రజలు సైతం అంతే ఉత్కంటతతో ఎదురు చూస్తున్నారు.

'హరిత' సన్నద్ధం

గ్రామాల్లోని నర్సరీల్లో కొనసాగుతున్న మొక్కల పెంపకం

- జిల్లాలో 255 గ్రామాలు.. 25.50లక్షల మొక్కల పెంపకమే లక్ష్యం
- ప్రతి నర్సరీలో పది వేల మొక్కల పెంపకం
- తొమ్మిదో విడత హరితహారానికి అధికారుల ఏర్పాట్లు

అమరచింత: పచ్చదనం వెల్లివిరిసేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా వానాకాలం ప్రారంభంలో హరితహారంలో భాగంగా మొక్కలు నాటి సంరక్షించే కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇప్పటి వరకు ఎనిమిది విడతలు విజయవంతంగా పూర్తిచేసిన అధికారులు తొమ్మిదో విడతకు సిద్ధమవుతున్నారు. నెల రోజులుగా గ్రామాల్లో నర్సరీల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఏటా ప్రతి గ్రామంలో పది వేల మొక్కల సామర్థ్యంతో నర్సరీని ఏర్పాటుచేసి వాటి నిర్వహణ బాధ్యతను సర్పంచ్‌లకు అప్పగించేవారు. ఈ ఏడాది సర్పంచ్‌తో పాటు ఉపాధిహామీ క్షేత్ర సహాయకులను సైతం భాగస్వాములను చేశారు. ఇప్పటికే గ్రామాల్లోని నర్సరీల్లో ప్లాస్టిక్ కవర్లలో మట్టి నింపి విత్తనాలు నాటి రోజు ఉదయం, సాయంత్రం నీరందిస్తున్నారు. జిల్లాలోని 255 గ్రామాల్లో ఉన్న నర్సరీల్లో 25.50 లక్షల మొక్కలు పెంచేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

ఇప్పటి వరకు రెండు కోట్ల మొక్కలు....

తెలంగాణ ప్రభుత్వం ఇప్పటి వరకు ఎనిమిది విడతలు హరితహారం కార్యక్రమం నిర్వహించి మొత్తం 2.40 కోట్ల మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. వాడిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కలు నేడు పెద్దవై పచ్చదనంతో కళకళలాడుతున్నాయి.

ప్రతి నర్సరీలో 10 వేల మొక్కలు..

ప్రతి గ్రామంలో పది వేల మొక్కల చొప్పున ప్రభుత్వపరంగా నర్సరీ నిర్వహణ చేపడుతున్నారు. జాతీయ ఉపాధిహామీ పథకం కూలీల సహకారంతో ప్రతి ఏడాది మొక్కలు పెంచడం.. వాటిని అదే గ్రామంలో నాటడం చేపడుతున్నారు. గ్రామపంచాయతీ వాటర్ ట్యాంకర్‌తో నీటిని అందిస్తున్నారు. నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీటిని అందించి అవి పెరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. మొక్కల సంరక్షణ బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉండేలా అవగాహన కల్పిస్తున్నారు. ఇంటింటికి ఆరు పూల, పండ్ల మొక్కలు అందించి తమ తమ ఇళ్ల ఆవరణలోని ఖాళీస్థలంలో నాటేలా ప్రజలను చైతన్యపరుస్తున్నారు.


అమరచింత మండలం సింగంపేట నర్సరీలో మట్టి నింపే పనులను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

వాచర్లతో నిర్వహణ..

నర్సరీల నిర్వహణ బాధ్యతను ఉపాధి హామీ మేటీలతో పాటు వాచర్లకు అప్పగించారు. నర్సరీలోని మొక్కలతో పాటు గతంలో నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీటిని అందించాలని ఆదేశించడంతో మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించారు. 500 మొక్కలకు ఒక వాచర్ చొప్పున ఏర్పాటు చేసి మొక్కలు సంరక్షిస్తున్నారు.

పచ్చదనం పెంపొందించేందుకే..



గ్రామాల్లోని నర్సరీల నిర్వహణతో పాటు నాటిన మొక్కలను సంరక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. గతంలో హరితహారంలో నాటిన మొక్కలు ప్రస్తుతం ఏపుగా పెరిగి నీడతో పాటు స్వచ్ఛమైన గాలి అందిస్తున్నాయి. వీటితో పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. గ్రామానికో నర్సరీని ఏర్పాటు చేసి అదే గ్రామంలో వాటిని నాటేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– నర్సింహులు, డీఆర్డీఓ

నిన్న కళకళ.. నేడు వెలవెల

అలంపూర్: అసెంబ్లీ ఎన్నికలకు అలంపూర్ చౌరస్తాలోని మార్కెట్‌యార్డు వేదికగా మారింది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి ఇక్కడే ఎన్నికల కార్యకలాపాలు కొసాగసాగాయి. యార్డులో గోదాంలతో పాటు భవనాలు అందుబాటులో ఉండటంతో ఎన్నికల అధికారులు అడ్డాగా మార్చుకున్నారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లకు స్ట్రాంగ్‌రూం ఏర్పాటు, ఈవీఎంల పంపిణీ, తిరిగి తీసుకోవడం వంటి పనులు ఇక్కడే జరిగాయి. ఎన్నికల విధులకు వచ్చిన పోలీసులు, సిబ్బందితో నెల రోజులుగా మార్కెట్‌యార్డు కళకళలాడింది. ఎన్నికలు ముగిసిపోవడం, ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను కౌంటింగ్ కేంద్రాలకు తరలించడంతో మార్కెట్‌యార్డు ఖాళీ అయింది.


మార్కెట్ యార్డును ఖాళీ చేస్తున్న సిబ్బంది